ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com  RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం  తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

FRIDAY 21ST AUGUST 2026  EDITOR : SHAIK YACOOB PASHA  PAGES : 12  VOLUME : 09  ISSUE : 156  COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 21 ఆగస్టు 2026  ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా  పేజీలు : 12  సంపుటి : 09  సంచిక :156  వెల : రూ.3/-  ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

### కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

న్యూఢిల్లీ,ఆగస్ట్20 తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు.



# భూ భద్రత కోసమే భూ భారతి

- గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ఖమ్మం,ఆగస్ట్20 గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత

మిగతా 2వ పేజిలో..

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

- దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత
- పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




మహాబలిపురం,ఆగస్ట్20: కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దుల ను ప్రభుత్వ ÷ళ్లై కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల

మిగతా 2వ పేజిలో..

# కొత్త క్రిమినల్ చట్టాలపై సమన్వయంతో సాగాలి

### పోలీసులు, న్యాయవ్యవస్థకు చీఫ్ జస్టిస్ సూచన

హైదరాబాద్,ఆగస్ట్20:కొత్త చట్టాల అమలుకు పోలీసులు, న్యాయవ్యవస్థ, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, వైద్య, జైళ్ల శాఖల మధ్య బలమైన సమన్వయం అవసరమని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే బాధితులకు

మిగతా 2వ పేజిలో..

# పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

- నైపుణ్య శిక్షణ అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన
- మంత్రి వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్,ఆగస్ట్20 ఇటీవల స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీనంపై నెలకొన్న అపోహలకు మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదిం చారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కొందరు అపోహలు,

మిగతా 2వ పేజిలో..



# రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

- వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం
- ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఆగస్ట్20 భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని

మిగతా 2వ పేజిలో..

# అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



సిద్దిపేట,ఆగస్ట్20 సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30),

# తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

- రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ



హైదరాబాద్,ఆగస్ట్20: తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ం జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ

మిగతా 2వ పేజిలో..

# తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

- నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత
- పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి • బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

న్యూఢిల్లీ,ఆగస్ట్20 : రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమా ండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూముల ను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలం గాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్

మిగతా 2వ పేజిలో..

# లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

### కేంద్రం నిర్ణయించిందన్న అమిత్ షా...

న్యూఢిల్లీ,ఆగస్ట్20: కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. జమ్ముకశ్మీర్ హైకోర్టు బెంచ్‌ను లద్దాఖ్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర కేబినెట్ నిర్ణయించిందని హోం మంత్రి అమిత్ షా గురువారం తెలిపారు. బెంచ్ ఏర్పాటుతో లద్దాఖ్ ప్రజలకు న్యాయం మరింత

మిగతా 2వ పేజిలో..

# రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

# అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30? కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. 22ంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

# సిక్కు వ్యతిరేక అల్లర్ల నిందితుడు సజ్జన్ కుమార్ జైలులోనే మృతి



న్యూఢిల్లీ,ఆగస్ట్20: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.

# తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?చీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేవని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా?లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని ఆకాంక్షించారు. ట్రిబ్యునల్ లేకుండా, కమిటీ లేకుండా, బహుశా మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా సమస్యలు పరిష్కారం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరయ్యే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# భూ భద్రత కోసమే భూ భారతి

తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గతొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో పక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే పక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటికి స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రంగులు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనంటూ రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయ బంధాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

# పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. పాలిటెక్నిక్‌లను మరింత అప్‌గ్రేడ్ చేసి, విద్యార్థులకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతోనే వాటిని స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ తెలంగాణ యువత ముందుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని, వారి సర్వీసు భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. డిప్యూటేషన్, బదిలీల విధానంలోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసినప్పటికీ పాలిటెక్నిక్ ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పాలిసెట్‌ను కూడా కొనసాగిస్తామని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, లెక్చరర్లకు విలీనంతో మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు రూ.2 వేల స్టైఫండ్ అందించే అంశంపై కూడా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. వరంగల్‌లో విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకుని బదిలీ చేశామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలిటెక్నిక్ కాలేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని ఆరోపించిన మంత్రి.. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. శక్తి శాఖ పేరును కార్మిక శాఖగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయని, శాఖ పేరులో 'కార్మిక' పదం కూడా ఉండేలా మార్పులు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు.

# లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

చేరువవుతుందని చెప్పారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిక ప్రాంతాలకు ఒకే హైకోర్టు ఉన్న విషయం తెలిసిందే. కేంద్రం 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని విభజించి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేసింద. ఇదిలా ఉంటే, కేంద్రం బుధవారం రూ.9,450 కోట్ల విలువైన నాలుగు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఖరగ్‌పూర్-భద్రక్ మధ్య, భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య అదనపు రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో పాటు ఏపీ-తమిళనాడు, కటక్, పారాదీప్ మధ్య అదనపు లైన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. 2030-31 కల్లా వీటి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# కొత్త క్రిమినల్ చట్టాలపై సమన్వయంతో సాగాలి

సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. జస్టిస్ మౌషుమి భట్టాచార్య కొత్త చట్టాల అమలులో డిజిటల్ లిటరసీ అత్యంత అవసరమని, డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్స్‌లో తప్పులు, డూప్లికేట్ డేటా ఎంట్రీ వల్ల కేసుల్లో జాప్యం జరుగుతోందని సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాల డిజిటలైజ్డ్ అమలుపై తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమి, తెలంగాణ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర సమన్వయ సదస్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయ, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య శాఖల అధికారులు హైబ్రిడ్ విధానంలో సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'కొత్త క్రిమినల్ చట్టాలు కేవలం పాత చట్టాల స్థానంలో వచ్చినవి మాత్రమే కాదు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, డిజిటల్ ఎవిడెన్స్, ఎలక్ట్రానిక్ రికార్డులు, టైమ్ బౌండ్ ప్రొసీజర్స్‌కు ప్రాధాన్యం ఇస్తాయి' అని అన్నారు. డిజిటల్ ఎవిడెన్స్, డిజిటల్ కేస్ మేనేజ్‌మెంట్, నుంచి చార్జ్‌షీట్ వరకు ఆన్‌లైన్ పక్రియలపై సదస్సులో ప్రజెంటేషన్లు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు సాక్ష్యాలు, ఫోరెన్సిక్ మెడికల్ ఇంటర్‌ఫేస్‌లపై అవగాహన కల్పించారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగవంతం కావాలని డీజీపీ సూచించారు. కొత్త చట్టాల అమలుపై నెలవారీ సమీక్షా వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

జోగులాంబ గద్వాల,ఆగస్ట్20 విహారంలో విషాదం చోటు చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సందర్శనకు వచ్చి రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ధరూర్ మండల జూరాల ప్రాజెక్టు రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గానికి చెందిన శివకుమార్(మల్లేపల్లి), గణెళిష్(పీర్లగుట్ట), శ్రీకాంత్ (పెద్దాయపల్లి) ముగ్గురు కలిసి బైక్ పై జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. బైక్ పై గద్వాల వైపు వెళ్తున్న క్రమంలో డ్యాం రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేక్ వద్ద బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్ కు ఢీకొట్టింది.

## ఇందిరమ్మ ఇండ్లను పర్శిలించిన ఎంపీడీఓ సాయిలు



మద్నూర్ / ఆగస్టు 20 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం తడి హిప్పరగా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ఎంపీడీఓ సాయిలు పర్శిలించారు. గురువారం రోజున గ్రామంలో ఉన్నటువంటి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ దశలను పర్శిలించారు. ఇంటి యజమానులతో నిర్మాణ దశలు ఏ విధంగా కొనసాగుతున్నాయి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా ఎన్ని దఫాలు డబ్బులు వచ్చాయి అని తెలుసుకున్నారు. పంచాయతీ సెక్రెటరీ ద్వారా గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం జరిగింది. ఇప్పటి వరకు పూర్తి స్థాయిగా ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడం జరిగింది. నిర్మాణ దశలో ఎన్ని ఇండ్లు ఉన్నాయి , పూర్తి స్థాయిగా ఇండ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ఇంటి యజమానులకు తెలియ జేయాలనీ కోరారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ద్వారా అందె సంక్షేమ పథకాలు అందుతాయి తెలిపారు. నిర్మాణా దశలో ఉన్నటువంటి ఇందిరమ్మ ఇల్లు రూములు, స్లాబు, చుట్టూ ఉన్నట్టు ప్రాంతాలను పర్శిలించారు. ఇందిరమ్మ ఇండ్ల పరశీలనలో ఎంపీడీఓ పి. సాయిలు, సర్పంచ్ అశ్విని సుదర్శన్, పంచాయతీ సెక్రెటరీ జ్యోతి, కారోబారి, గ్రామస్థులు, ఇందిరమ్మ ఇండ్ల యజమానులు పాల్గొన్నారు.

## తడి హిప్పరగా గ్రామ పంచాయతీ రికార్డులు పరశీలన



మద్నూర్ / ఆగస్టు 20 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం తడి హిప్పరగా గ్రామ పంచాయతీ కార్యాలయం దస్త వేజులను ఎంపీడీఓ పి. సాయిలు పర్షిలించడం జరిగింది. గురువారం రోజున తడి హిప్పరగా గ్రామ పంచాయతిలో స్థానిక సర్పంచ్ అశ్విని సుదర్శన్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ జ్యోతి పంచాయతీ రికార్డులను చూపెట్టడం జరిగింది. గ్రామ పంచాయతికి ఇంటి పన్ను, నల్ల పన్ను, ఇతర పన్నుల యొక్క పన్నులు ప్రజలకు అవగాహన కల్పించి 100 % వసూలు చేసి గ్రామ పంచాయతీ ఆదర్శంగా, అభివృద్ధి ఏర్పాడేటట్లు కృషి చేయాలని కోరారు. ప్రత్యకంగా గ్రామంలో పరిశుభ్రత, మంచి నీటి సౌకర్యం, మురికి కాలువల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యక దృష్టి వహించి గ్రామ అభివృద్ధి లొ పాలు పంచుకోవాలని కోరారు గ్రామ పంచాయతీ సెక్రెటరీ జ్యోతి యొక్క కార్యాచరణ విధుల పట్ల హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

## ఆగస్టు 31 వరకు పెన్షన్ అప్లయ్ చేసుకోవాలి ఎంపీడీఓ సాయిలు



మద్నూర్ / ఆగస్టు 20 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండల అర్హులైన పెన్షన్ దార్లు ఈ నేల 31 వరకు పెన్షన్ ల కొరకు అప్లయ్ చేసుకోవాలని ఎంపీడీఓ పి. సాయిలు తెలిపారు. తమ యొక్క గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నూతన పెన్షన్ అర్హులైన అర్హత పత్రాలు అందించాలని కోరారు. వృద్యప్ప ( ఓల్డ్ ఏజ్ ) తప్ప మిగతా పెన్షన్లు ఒంటరి మహిళ, వితంతువు, వికలాంగులు, చేనేత కార్మికులు, గీతా కార్మికులు, ఫైలరైడ్, డయాలసిస్ సంబంధిత అర్హులైన వారు ఈ నేల ఆగస్టు 31 వరకు అప్లయ్ చేసుకోవాలని కోరారు. 1) వికలాంగులు - 40 % శాతం పై బడిన వారు అర్హులని తెలిపారు. 2) ఒంటరి మహిళలు - 18 సంవత్సర పై బడిన వారు. పెళ్లి కానీ ఒంటరి మహిళల కోసం 30 సంవత్సరాలు పై బడిన వారు. 3) వితంతువులు - 18 సంవత్సరాలు పై బడిన వారు. 4) గీతా కార్మికులు - 50 సంవత్సరాలపై బడిన వారు, 5) ఫైలరైడ్ - సంబంధిత శాఖ డి. యం. హెచ్. లో కార్యాలయం నుండి గ్రేడ్ -2, గ్రేడ్ - 3 ధ్రువీకరణ పత్రాలు, 6) డయాలసిస్ - ఆరోగ్య శ్రీ డయాలసిస్ ఇంట్రోల్మెంట్ ద్వారా ధ్రువీకరణ పత్రం ఉన్నా వారు ఆయా పెన్షన్లకు అర్హులని తెలిపారు. పెన్షన్ అప్లయ్ చేసుకొని ప్రభుత్వం ద్వారా అందె ఆర్థిక సహకారం లొ భాగస్వామ్యం కావాలని కోరారు.

# పంపు ఫౌండ్ పనుల కోసం మొగ్గు వేసిన ఎంపీడీఓ





మద్నూర్ / ఆగస్టు 20 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం తడి హిప్పరగా గ్రామంలో ప్రభుత్వ స్థలంలో పంపు ఫౌండ్ కొరకు ఎంపీడీఓ సాయిలు, సర్పంచ్ అశ్విని సుదర్శన్, పంచాయతీ సెక్రెటరీ జ్యోతి మొగ్గు వేయడం జరిగింది. గురువారం రోజున గ్రామంలోని స్మశాన వాటిక వద్దా ఉన్నటువంటి ప్రభుత్వ భూమి ఒక గుంటలో పంపు ఫౌండ్ కొరకు 12/12 స్థలంలో 6 ఫిట్ లోతు గుంత తవ్వుడు కోసం మొగ్గు వేయడం జరిగింది. దీని కోసం 1,25,000 ( ఒక లక్ష ఇరువై ఐదు ) వేల రూపాయలు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. ఈ పనులు ఉపాధి హామీ కూలీల ద్వారా 100000 ( లక్ష ) రూపాయలు, 25, 000 వేల రూపాయలు సంబంధిత పనుల కోసం సామాన్ల కొరకు నిధుల ద్వారా పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అలాగే స్మశాన వాటిక పక్కకు ఉన్నటువంటి పాత బొర్ ఇంకిడి గుంత కొరకు 35,000 వేల రూపాయలు మంజూరు కావడం తో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ పి. సాయిలు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ అశ్విని సుదర్శన్, పంచాయతీ సెక్రెటరీ జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేజీబీవీ హాస్టల్‌లో ఎంపీడీవో బద్రి శైలజ రాణి ఆకస్మిక తనిఖీ



రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 20 (అక్షరం న్యూస్): రామగిరి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ ) హాస్టల్‌ను ఎంపీడీవో బద్రి శైలజ రాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని తరగతి గదులు, వసతి గదులు, టాయిలెట్లు, స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం, వారికి కేటాయించిన భోజన విరామ సమయంలోనే భోజనాలు వడ్డించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కిచెన్ పరిసరాలు, డైనింగ్ హాల్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఈగలు, దోమలు వాలకుండా క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలని వర్కర్లకు సూచించారు. విద్యార్థులకు కేటాయించిన భోజన విరామ సమయానికి ముందే వంట పూర్తయ్యేలా చూడాలని కుక్, అసిస్టెంట్ కుక్‌లకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు హాస్టల్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీడీవో బద్రి శైలజ రాణి సూచించారు. ఈ కార్యక్రమంలో పన్నూరు సర్పంచ్ చిందం మహేష్, కేజీబీవీ ప్రిన్సిపాల్, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



రామగిరి (పెద్దపల్లి జిల్లా) ఆగస్టు 20 అక్షరం న్యూస్ :

సమాజానికి దిశా నిర్దేశం చేసి బావి భారత పౌరలను దేశానికి అందించే కఠినమైన గురుతర బాధ్యతను మోసే గురువులకు నేటి సమాజములో అడుగడున అవమానాలే అయినా భరిస్తూ సమాజహితమే తమ సంతోషంగా జీవిస్తున్న గురువుల యొక్క జీవితాలు బుగ్గిపాలవుతున్న సంఘటనలు అనేకం అందులోనే జరిగిన మరో దారుణం నల్గొండ జిల్లా నాగార్జున స్కూల్ లో ప్రిన్సిపాల్ గా పని చేస్తున్న రూప రెడ్డి హత్య ఉదంతం, పిల్లలకు విద్య బుద్దులు నేర్పే క్రమంలో గట్టిగ మందలించిన రూపరెడ్డి పై అదే పాఠశాలలో చదివే 10 వ తరగతి విద్యార్థులే దాడి చేసి ఆమెను దారుణంగా హత్య చేయడం దిగ్బ్రాంతికార సంఘటన సమాజంలో గురువు పాత్రను మరోసారి అవహేళన చేసినట్టు ఉందని పలువురు మేధావులు వాపోతున్నారు,. ఇలాంటి సంఘటనలు భవిషత్తులో జరగకుండా ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలకు గురువు యొక్క ప్రాముఖ్యత, గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రతి వ్యక్తి ఈలాంటి సంఘటనలు ఖండిచాలని కోరుతూ రూప రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని రామగిరి మండలంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల. శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్ బాబు, రంజిత్ రెడ్డి మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది. అదే విధంగా ఈ హత్యకు నిరసనగా రేపు పాఠశాలకు సెలవు ప్రకటించడం జరిగింది.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యపై ట్రస్మా ఆగ్రహం

- బంద్‌కు ట్రస్మా సంపూర్ణ మద్దతు.
- నిందితులకు కఠిన శిక్ష విధించాలని ట్రస్మా డిమాండ్.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి, ఆగస్టు 20/ అక్షరం న్యూస్ -:

నల్లగొండ జిల్లాలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య ఘటనపై మందమర్రి మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులపైనే విద్యార్థులు దాడులకు పాల్పడటం అత్యంత బాధాకరమని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ గురువారం సాయంత్రం 6 గంటలకు మందమర్రి మార్కెట్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర, జిల్లా సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించే పాఠశాలల బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ట్రస్మా మండల అధ్యక్షుడు పెద్దపెల్లి ఉప్పలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న డ్రగ్స్ సంస్కృతి, చిన్నారులకు విచ్చలవిడిగా అందుబాటులోకి వస్తున్న సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, హింసాత్మక కంటెంట్ విద్యార్థులను పెడదోవ పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను హతమార్చే స్థాయికి విద్యార్థులు దిగజారడం సమాజానికి తీరని మచ్చ అని అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ నిర్మూలనకు ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. ట్రస్మా మందమర్రి మండల గౌరవాధ్యక్షుడు పోల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రూపారెడ్డి హత్య ఘటన రాష్ట్రాన్ని కలచివేసిందన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలిని విద్యార్థులే అత్యంత కిరాతకంగా హత్య చేయడం సమాజం సిగ్గుపడాల్సిన విషయమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై మానవత్వాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల అతిగారాబం, క్రమశిక్షణ లోపం వల్ల విద్యార్థుల్లో బాధ్యతారాహిత్యం పెరుగుతోందని, పాఠశాలల్లో క్రమశిక్షణ అమలు చేసే విషయంలో ఉపాధ్యాయులకు తగిన స్వేచ్ఛ, హక్కులు కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించడంతో పాటు రూపారెడ్డి హత్య కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకుని చట్టప్రకారం అత్యంత కఠిన శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ట్రస్మా నాయకులు పిలుపునిచ్చారు.

## రూపా రెడ్డి హత్యను ఖండిస్తూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సంతాప కార్యక్రమాలు




రామగిరి, (పెద్దపల్లి జిల్లా), ఆగస్టు 20, అక్షరం న్యూస్: నల్లగొండ జిల్లాకు చెందిన ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం సంతాప కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై రూపా రెడ్డి మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తూ, ఈ దారుణ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టి ఆర్ ఎస్ ఎం ఎ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులను కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా టీ ఆర్ ఎస్ ఎం ఏ అధ్యక్షులు ఎ. కేశవరెడ్డి, జనరల్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, ట్రెజరర్ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఉద్యోగులకు హామీలు అమలు చేయాలి

- **సీపీఐ నేత ధనుంజయ నాయుడు డిమాండ్**



సూర్యాపేట /నేరేడుచర్ల/ఆగష్టు 20( అక్షరం న్యూస్ )గ్రామపంచాయతీ సిబ్బందికి గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు.పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని, పీఆర్సీ వర్తింపజేయాలని కోరారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానానికి సంబంధించిన జీవో 51ను రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక కేటగిరీ కల్పించాలని అన్నారు.కార్మికుల ఖాతాల్లో నేరుగా వేతనాలు జమ చేయడంతో పాటు మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం, అంత్యక్రియల కోసం రూ.30 వేల సాయం అందించాలని కోరారు. కార్మికులకు ఆరోగ్య సౌకర్యాలు, వారి పిల్లలకు ఉచిత విద్య కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.


## పెంచికల్ దిన్నెలో మత్స్య శాఖ సొసైటీ ఎన్నికలకు నామినేషన్ల సమర్పణ...



సూర్యాపేట /నేరేడుచర్ల/ఆగష్టు 20 (అక్షరం న్యూస్)


నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్నె మత్స్య శాఖ సొసైటీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో సొసైటీ సభ్యుల తరఫున నామినేషన్లు సమర్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారిణి శ్రీమతి కమల మేడమ్‌కు సభ్యులు నామినేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సొసైటీ ఏర్పడిన నాటి నుంచి తొలిసారిగా బ్యాలెట్ పద్ధతిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఎన్నికల అధికారిణిని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ నర్సింగ చిన సోములు, సొసైటీ సభ్యులు ఇంజమూరి వెంకటయ్య, సిరికొండ నాగయ్య, సిరికొండ మట్టయ్య, యడవల్లి వెంకటకృష్ణ, సింగం సైదులు, పెండెం రాములు గౌడ్, యామగాని రాంబాబు గౌడ్, కుక్కడపు ఉషేన్ గౌడ్, నాయిని బాలకృష్ణ, పెండెం నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెర్లుమద్ది గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి




రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -20(అక్షరం న్యూస్ )

సిద్దిపేట డిపో నుండి ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ సిద్దిపేట బస్ డిపో మేనేజర్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు.కామారెడ్డి నుంచి ఉదయం 6 గంటలకు బస్సు ప్రారంభించి, సాయంత్రం 6 గంటలకు సిద్దిపేట నుంచి బస్సు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అలాగే సిద్దిపేట--కామారెడ్డి మధ్య నడిచే బస్సును ఇబ్రహీంపూర్, తెర్లుమద్ది మీదుగా నడిపించి, గ్రామస్థులకు కామారెడ్డికి వెళ్లే సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తే తెర్లుమద్ది గ్రామంలోని విద్యార్థులు, రోజువారీ కూలీలు, ఉద్యోగులు, ఇతర గ్రామస్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సర్పంచ్ బైతి దుర్గమ్మ తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే బస్సు సర్వీసు ప్రారంభించాలని ఆమె కోరినట్లు తెలిపారు


గ్రామ పంచాయతి కార్యాలయము, తెర్లుమద్ది
మం: ముస్తాబాద్, జి: రాజన్న సిరిసిల్ల, తెలంగాణ రాష్ట్రం.
బైతి దుర్గమ్మ సర్పంచ్
సెల్: 9491364619
Baithi Durgamma
SARPANCH
తేది: 18-08-2026
[illegible]

## అధికారులు..ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి







- **మండల ప్రత్యేక అధికారి మరళీధర్ రావు**

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 20: అధికారులు.. ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేసేనప్పుడే సవ గ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.మురళీధర్ రావు అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన మండల ప్రజా పరిషత్ సమీక్ష సమావేశానికి ఎంపిడివో గార్లపాటి శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, స్పెషల్ ఆఫీసర్ మురళీధర్ రావు హాజరై మాట్లాడారు. అంతకు ముందు ఎల్నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి ప్రతి గ్రామంలో తప్పనిసరిగా ఫాం పాండ్లతో పాటు ఇంకుడు గుంతలను నిర్మించ కోవాలని విబీ రామ్జీ టెక్నికల్ అధికారి శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు యూని ఫాంలు అందలేదని గబ్బెట సర్పంచ్ కూటికంటి ఉపేంద్ర అధికారుల దృష్టికి తీసుకరాగా, ఐకేపీ సీసీ రీనావతిత్వరలోనే అందజేస్తామని సమాధానమిచ్చారు. కోమల్ల పిహెచ్సీలో బోరు, వాటర్ ట్యాంకు ద్వారా తాగు నీటి సౌకర్యం కల్పిస్తున్నామని, జీపీ భవన నిర్మాణం త్వరలో చేపట్టాలని కోమల్ల సర్పంచ్ వల్లాల అశోక్ అన్నారు. కోమల్ల జీపీ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేసిన స్థలంలో కాకుండా వేరే చోట నిర్మించదలుచుకుంటే తప్పనిసరిగా గ్రామ సభ తీర్మాణం ఉండాలని ఎంపిడివో శ్రీనివాసులు తెలిపారు. భాంజీపేటలో నిలిచి పోయిన ప్రభుత్వ భవన నిర్మాణాలను చేపట్టడానికి సత్వర చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గైని శ్రీనివాస్ కోరారు.



సమావేశంలో వివిధ శాఖలకు చెం దిన అధికారులు అనూష, రవిందర్, రవి దొర, మౌనిక, ఎస్.కె అసిఫా, రాహుల్, ఎంఈవో రఘునందన్ రెడ్డి, సర్పంచ్ లు గొంగళ్ల అబ్రహీం, పయ్యావులరవి,పోకల శ్రీనివాస్, సింగిరెడ్డి సునీత, ఇరియా నాయక్, రామచంద్రు, పొన్నగంటి చైతన్య, బైకాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓసిపి-5 భూసేకరణలో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం

- **సాగుదారులను పక్కన పెట్టి నష్టపరిహారం చెల్లిస్తున్నారనే ఆరోపణలు చేస్తున్న రైతులు**

రామగిరి (పెద్దపెల్లి జిల్లా) ఆగస్టు 20 అక్షరం న్యూస్:

పెద్దపల్లి జిల్లా సుందిళ్ల గ్రామ శివారులో దళిత రైతులకు చెందిన భూములను సింగరేణి సంస్థ ఓసిపి-5 ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న నేపథ్యంలో నష్టపరిహారం, సెటిల్‌మెంట్ చెల్లింపుల ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.ఏళ్ల తరబడి భూములను స్థానికంగా ఉండి సాగు చేసుకుంటూ, పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్న రైతుల వద్ద అడంగల్, పహాణీ, పట్టాదారు పాస్‌బుక్ తదితర అధికారిక భూ రికార్డులు ఉన్నప్పటికీ, వారికి కాకుండా కేవలం భూమి వద్ద ఫొటోలు దిగిన వ్యక్తులకు లేదా వాస్తవ సాగుదారులపై స్పష్టమైన ఆధారాలు లేని వారికి నష్టపరిహారం చెల్లిస్తున్నారనే ఆరోపణలు చేస్తున్న సుందిళ్ల రైతులు. ఈ సందర్భంగా సందిల్లా గ్రామ దళిత రైతులు మాట్లాడారు... ఇది నిజమైన రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా వారి జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై అర్ జి-1 లలిత్ కుమార్ కు పలుమార్లు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అలగే “మా భూములను తీసుకుంటూ, మా హక్కులను గుర్తించకుండా నష్టపరిహారం ఎలా చెల్లిస్తారు?” అని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారిక భూ రికార్డులు, సాగు ఆధారాలు ఉన్న రైతులను పక్కనపెట్టి ఇతరులకు చెల్లింపులు జరిగితే అది మరింత అన్యాయానికి దారితీస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల స్థాయిలో ఎవరైనా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు ఉంటే వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని నిజమైన బాధిత దళిత రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దళిత రైతుల ప్రధాన డిమాండ్లు ప్రస్తుతం జరుగుతున్న నష్టపరిహారం/ సెటిల్‌మెంట్ చెల్లింపుల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని, భూములకు సర్వే--రీ సర్వే నిర్వహించి వాస్తవ సాగుదారులను గుర్తించాలని, అడంగల్, పహాణీ, పట్టాదారు పాస్‌బుక్, పాత రికార్డులు, సాగు ఆధారాలను పరిశీలించాలని, వారు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా వాస్తవంగా భూమిని సాగు చేసుకున్న అర్హులైన రైతులకే చట్టబద్ధంగా నష్టపరిహారం అందించాలని, ఇప్పటికే చెల్లింపులు జరిగినట్లయితే వాటిపై సమగ్ర విచారణ జరిపి అవకతవకలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,




దళిత రైతుల భూముల విషయంలో ప్రత్యేకంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విచారణ చేపట్టాలని, రైతుల అభ్యంతరాలను నమోదు చేసుకుని, విచారణ పూర్తయ్యే వరకు వివాదాస్పద భూములపై చెల్లింపులు చేయకూడదనీ,అదేవిధంగ “భూమి కోల్పోయేది మేము... జీవనాధారం కోల్పోయేది మేము... అలాంటప్పుడు నష్టపరిహారం మాత్రం వేరే వారికి ఎలా?” అంటూ సుందిళ్ల దళిత రైతులు ప్రశ్నిస్తున్నారు.తమకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాడుతామని, బాధిత రైతులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, సింగరేణి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిజమైన రైతులను గుర్తించి, వారికి న్యాయమైన నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కృష్ణా జలాలతో హుజూర్‌నగర్‌ను సస్యశ్యామలం చేస్తా..





- **హుజూర్‌నగర్ రైతుల కల సాకారం**
- **రూ.1,648 కోట్లతో 53 వేల ఎకరాలకు సాగునీరు**

సూర్యాపేట/హుజుర్నగర్ , ఆగస్టు 20:అక్షరం న్యూస్

కృష్ణా జలాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద రూ.1,648 కోట్లతో చేపడుతున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను గురువారం మంత్రి పరిశీలించారు. పంప్‌హౌస్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్టు ద్వారా మట్టంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లోని 23 గ్రామాల్లో 53 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. మొత్తం 19,295 కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం 191 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రైతులకు రూ.60 కోట్ల నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు.నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల బ్యాక్ వాటర్‌ను వినియోగించి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. డిసెంబర్ నాటికి ప్రాజెక్టు రూఫ్‌టాప్ లెవెల్, పంప్‌హౌస్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ -16షాట్ పుట్ లో రాణించిన విద్యార్థిని



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -20(అక్షరం న్యూస్ )

జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్నిర్వహించిన అండర్--16 షాట్పుట్ విభాగంలో ముస్తాబాద్ మండలం బంధానకల్ పాఠశాల లో విద్యను అభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థిని బుచెల్లి హృతిక ప్రియదర్శిని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి అద్భుత ప్రతిభను కనబరిచింది అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు ఈ ఘన విజయంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణం.అన్నారు హృతిక ప్రియదర్శినికి గ్రామ సర్పంచ్ చిగురు నరేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తరఫున రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలను సాధించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్



రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 20 (అక్షరం న్యూస్): భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు గురువారం రామగిరి మండలం బేగంపేట ఎక్స్‌రోడ్‌లోని పెట్రోల్ పంప్ వద్ద గల మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొద్ద బాపన్న పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణం కోసం రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు సాంకేతిక రంగంలో భారతదేశాన్ని ప్రపంచ పటంలో ముందు వరుసలో నిలబెట్టేందుకు ఆయన చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని పేర్కొన్నారు.పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఓటు హక్కు వయస్సును తగ్గించడం, ఐటీ రంగానికి పునాదులు వేయడం వంటి సంస్కరణలు ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ప్రజాసేవలో ముందుకు సాగడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్తాబాద్ లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు!



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -20(అక్షరం న్యూస్ )

దివంగత మాజీ ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ గారి 82వ జయంతిని పురస్కరించుకొని ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగజ్జెల రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహం కు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు గజ్జెల రాజు మాట్లాడుతు దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విశ్వసించిన, యువతకు అవకాశాలను,కేవలం 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి, దేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో యువతకు కీలకమైన పాత్ర కల్పించిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి . 73వ, 74వ రాజ్యాంగ సవరణలకు ఆయన ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రయత్నాలు స్థానిక సంస్థలకు ప్రజాస్వామ్య బలాన్ని చేకూర్చాయి అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లా బాల్ రెడ్డి,మాజీ ఎంపిటిసి గుండెలి శ్రీనివాస్, ఆరుట్ల మహేష్,ఆత్మ డైరెక్టర్లు కొండల్ రెడ్డి,టి శ్రీనివాస్,బీసీ సెల్ ఆగుళ్ల రాజేశం,ఉచ్చుడి బాల్రెడ్డి ,ఎస్సి సెల్ అధ్యక్షులు కాంపల్లి శ్రీనివాస్,కొప్పు రమేష్, వేముల సత్యం, మిరుదొడ్డి భాను,రంజాన్ నరేష్,ధీటి నర్సింలు, కర్ణాకర్, గూడెం బాలయ్య, ఆంజనేయులు, షాదుల్ పాప,బాలసాని శ్రీనివాస్, ఏద్దండి మహేందర్,పుల్లూరి రవి,ఎన్ ఎస్ యూ ఐ నాయకులు భాను, సంతోష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

# వీడియో కాల్‌లో అంత్యక్రియలు

- వాట్సాప్‌లో 'అస్థికల' వీడియో
- శ్రీమంతుడి నుంచి శరణార్థి వరకు..



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్ / ఆగస్టు 20 /అక్షరం న్యూస్ ప్రతినిధి.

(మహమ్మద్ యూసుఫ్ అలీ)

కన్న ప్రేమను, కనిపెంచిన బంధాలను నడిరోడ్డుపై వేలం వేస్తున్న ఆధునిక సమాజానికి ఈ సంఘటన ఒక చెంపపెట్టు. జీవితమంతా రక్తాన్ని చెమటగా మార్చి, ముగ్గురు కుమార్తెలను రెక్కలొచ్చిన పక్షుల్లా ఉన్నత తీరాలకు చేర్చిన ఆ తండ్రి చివరికి అనాథలా కన్నుమూశాడు.ముంబైలో ఒకప్పుడు యవ్వనంలో పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని ఏలి, హోదా, డబ్బు సంపాదించిన శివచరణ్ రామ్ రతన్ గుప్తా కి కొడుకులు లేకపోయినా, తన ముగ్గురు కూతుళ్లలోనే భవిష్యత్తును చూసుకున్నారు. వారి పెళ్లిళ్లు ఆర్భాటంగా జరిపించారు. కానీ, పెళ్లిళ్ల తర్వాత కుమార్తెలు తమ జీవితాల్లో బిజీ అయిపోయారు. కాలక్రమేణా వ్యాపారం తగ్గడం, ఉన్నదంతా కూతుళ్ల వశమవ్వడంతో వృద్ధాప్యంలో చేసేదేమీ లేక తన భార్యతో కలిసి హర్యానాలోని సోనిపట్ వృద్ధాశ్రమానికి చేరుకున్నారు.అక్కడ కాలం మళ్లీ కాటేసింది. 'నా' అనే వాళ్లు లేని ఒంటరితనం మధ్య ఒకసారైనా కూతుళ్లు వస్తారేమోననే ఆశతోనే ఆయన భార్య కాలం చేసింది. అప్పట్లో పిల్లలకు చావు కబురు పంపినా, సమయం లేదని ఒకరు, దూరంగా ఉన్నామని మరొకరు, వీలు కాదని ఇంకొకరు సాకులు చెబుతూ తల్లి బంధాన్ని తుడుచుకున్నారు. చేసేదేమీ లేక గుప్తా స్వయంగా భార్య అంత్యక్రియలు పూర్తి చేసి, అస్థికలను నదిలో కలిపి ఆశ్రమంలో ఒంటరి జీవితాన్ని గడపసాగారు. పోషించి పెంచిన పేగుబంధం మీద ఆశ చావక, రోజంతా ఆశ్రమ గేటు వైపు చూస్తూ గడిపేవారు. ఆ ఎదురుచూపుల్లోనే 'ఇక చాలు ఈ జీవితం' అన్నట్లు ఆయన శ్వాస కూడా 78వ ఏట ఆగిపోయింది. గుప్తా మరణవార్తను ఆశ్రమ సిబ్బంది కూతుళ్లకు తెలియజేయగా, వారు మళ్లీ అవే సాకులు చెప్పారు. అంతేకాకుండా దహన సంస్కారాల ఖర్చుల కోసం ?5,100 పంపి, అంత్యక్రియలను ఆన్‌లైన్ వీడియో కాల్‌లో చూపిస్తే చాలని చెప్పడం తో ఆశ్రమ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఆ మానవతా రహిత ప్రవర్తనకు నిరసనగా, ఆశ్రమ సిబ్బంది ఆ డబ్బులను కూతుళ్లకే తిరిగి పంపించి, చివరి ప్రయాణ వీడ్కోలును తామే గౌరవప్రదంగా చూసుకుంటామని చెప్పారు. కానీ ఇక్కడే మరో షాకింగ్ నిజం ఏంటంటే, తండ్రి అస్థికల గురించి ఏ ఒక్క కుమార్తె అడగలేదు గానీ, అంత్యక్రియల వీడియో పంపమని కోరడం చచ్చిన వారి స్వార్థ రాతి గుండెలకు అద్దం పడుతోంది. రక్తసంబంధాల కన్నా రూకలే మిన్న అనుకునే రాతి యుగంలోకి మన పయనం సాగుతోందా? తొమ్మిది నెలలు మోసి, గోరుముద్దలు తినిపించిన తండ్రి పార్థివ దేహాన్ని చూడటానికి నేపాల్, ఉత్తరప్రదేశ్, ముంబైలలో ఉన్న కుమార్తెల వద్ద "సమయం" లేకపోవడం కన్నా దిగజారుడుతనం మరొకటి లేదు. ఆశ్రమంలోని పరాయి వ్యక్తులు ఆ తండ్రికి అగ్ని సంస్కారాలు చేసి, నిజమైన మానవత్వాన్ని చాటుకున్నారు.చదువులు, పదవులు, విదేశీ జీవితాలు మనుషులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి గానీ, హృదయాలను రాళ్లుగా మార్చకూడదు. కన్నవారిని కడతేర్చే తీరిక లేని ఈ ఆధునిక జీవన విధానం, మనం సాధిస్తున్న సాంకేతిక ప్రగతిని చూసి నవ్వుతోంది. మానవ విలువలు,సిగ్గుతో చచ్చి పోతున్నాయి. నేడు ఆ తండ్రి స్థానంలో మనం కాకపోయినా, రేపు మన పిల్లలకు మనం నేర్పుతున్న పాఠం ఇదేనా అని ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆస్తులను, అవకాశాలను పంచిన కన్నవారికి కన్నీటి నివాళి' కూడా ఇవ్వలేని సమాజంలో ఉన్నాం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి. ఈ సమస్య ఏ ఒక్కరిదో కాదు,వయసు మళ్లుతున్న మనందరిది. ఇది ఇలాగే కొనసాగితే వృద్ధ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పరిమితం చేసి, వీడియో కాల్స్‌తో రుణం తీర్చుకోవడం ఒక ఆచారంగా మారే ప్రమాదం ఉంది. ఆస్తులు అంతరిస్తాయి, సాంకేతిక మారుతుంది, కానీ బంధాలు, బాధ్యతలు లేని సమాజం శవంతో సమానమని గుర్తుంచుకోవాలి. కడపటి కట్టే కాలే వరకు తోడుండే నైతిక విలువలను మన పిల్లలకు నేర్పకపోతే, రేపు ఆ తండ్రి స్థానంలో ఉండేది మనమే.తల్లి తండ్రులను ఆశ్రమలకు పంపే పిల్లలకు గుణ పాఠం నేర్పే విధంగా సమాజం నిలబడాలి. అలాంటి వారిని వ్యక్తిగతంగా బహిష్కరించాలి, జన్మనిచ్చిన తల్లి తండ్రుల తో విశ్వాసంగా లేని వారు మనతో ఎలా విశ్వాసంగా ఉండగలరో నిలదీయాలి. ఇలా చేయడం ద్వారా కొంత లో కొంతైనా మార్పు ఆశించవచ్చేమో.

# సేంద్రియ ఎరువుతో భూసారం పెంపు






- రసాయన ఎరువుల వినియోగాన్ని 10--20 శాతం తగ్గించవచ్చు

సూర్యాపేట/గడ్డిపల్లి/ఆగష్టు 20(అక్షరం న్యూస్ )

ద్రవ పులియబెట్టిన సేంద్రియ ఎరువు (ఎల్‌ఎఫ్‌ఓఎం) వినియోగంతో భూసారాన్ని మెరుగుపరచడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని ఐసీఏఆర్--క్రిడా, హైదరాబాద్ సీనియర్ శాస్త్రవేత్త, మట్టి శాస్త్ర నిపుణులు డా. వి. గిరిజావేణి తెలిపారు.కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) గడ్డిపల్లి, ఐసీఏఆర్--క్రిడా హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రైతులకు ఎల్‌ఎఫ్‌ఓఎం తయారీ, వినియోగం, ప్రయోజనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ఇన్‌చార్జ్ డి. నరేశ్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. గిరిజావేణి మాట్లాడుతూ ఎల్‌ఎఫ్‌ఓఎం తయారీ విధానం, పంటల్లో వినియోగించే పద్ధతులను రైతులకు వివరించారు. ఒక హెక్టారుకు సుమారు 100 లీటర్ల ఎల్‌ఎఫ్‌ఓఎంను విత్తనాలు విత్తడానికి 10 రోజుల ముందు దుక్కిలో వినియోగించడం ద్వారా పరిస్థితులను బట్టి 10--20 శాతం వరకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు.పశు పోషణతో పాటు వ్యవసాయం చేస్తున్న రైతులు పశువుల ఎరువు, ఇతర వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి ఎల్‌ఎఫ్‌ఓఎంను తయారు చేసుకోవచ్చని తెలిపారు. స్థానికంగా లభించే సేంద్రియ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేలలో సేంద్రియ పదార్థం పెరిగి భూసారం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ వనరుల వినియోగాన్ని పెంచడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.ఐసీఏఆర్--క్రిడా సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ శాస్త్ర నిపుణులు డా. సుమంత్ కుండు మాట్లాడుతూ ఎల్‌ఎఫ్‌ఓఎం తయారీ, సరైన వినియోగం, పంటల దిగుబడి పెంపు, నేల ఆరోగ్యం, సేంద్రియ పోషకాల సమర్థ నిర్వహణలో దాని ప్రాధాన్యతను వివరించారు.అనంతరం కేవీకే గడ్డిపల్లి క్షేత్రంలో ఎల్‌ఎఫ్‌ఓఎం వినియోగంతో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి పరిశీలించారు. పంట పెరుగుదల, నేల ఆరోగ్యం, సేంద్రియ పోషకాల నిర్వహణకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు.కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు డి. నరేశ్, ఎ. కిరణ్, డి. ఆదర్శ్, పి. అక్షిత సాయి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతే భవిష్యత్‌కు పునాది....





సూర్యాపేట /నేరేడుచర్ల/ఆగష్టు 20(అక్షరం న్యూస్ )

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్లలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక స్వావలంబనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్బీఐ ఫీల్డ్ ఆఫీసర్లు షేక్ రియాజ్, వై. నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బ్యాంకింగ్ విధానాలు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు బాల్యదశ నుంచే ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు. ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలు, ఆర్థిక నేరాలపై విద్యార్థులకు వివరించారు. సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి బ్యాంకు ఖాతా కలిగి ఉండటం, బ్యాంకు లావాదేవీలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమన్నారు. ఆదాయం, ఖర్చులపై స్వయం నియంత్రణతో వ్యవహరించడం ద్వారా చిన్ననాటి నుంచే ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సైదులు, వై. జానయ్య, కొనత వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండలో ప్రిన్సిపల్ రూపరెడ్డిని పదవ తరగతి విద్యార్థులు అత్యాచేయడమే నిరసిస్తూ ప్రదర్శన



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

నల్గొండ జిల్లాలో ప్రిన్సిపల్ రూపరెడ్డిని పదవ తరగతి విద్యార్థి హత్య చేయడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ అమోదిత పాఠశాల సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని రమేష్ నగర్ లో కొవ్వొత్తుల ప్రదర్శన, మానవహారం, ర్యాలీ నిర్వహించారు. క్రమశిక్షణ దారి తప్పుతున్న పిల్లలను సక్రమమార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తుంటారని, ఇలాంటి సంఘటనలు ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్య జీవితంలో పిల్లల వ్యవహార శైలిని తల్లిదండ్రులు నిరంతరంగా గమనిస్తూ ఉండాలన్నారు. రూపారెడ్డి హత్య సంఘటనను తల్లిదండ్రులు, స్వచ్ఛంద, సామాజిక సంస్థలు తీవ్రంగా ఖండించాలని కోరారు. ఉషోదయ, గుడ్ మార్నింగ్, వాసవ్య, శ్రీరామ, ఆలీలిమ్, మార్గదర్శి, అమరావతి, ఆపిల్ కిడ్స్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వామోదిత పాఠశాలల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అంజా రెడ్డి, రామగుండం నగరపాలక ప్రాంత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అదర్ సండే సమ్మారావు, కొత్త శ్రీనివాసరెడ్డి, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు చంద్రమౌళి, రవి, జ్యోతి, చాంద్, సునీత పాల్గొన్నారు.

## శరీర అవయవదానాలకు అంగీకార పత్రశీ



ఓదెల పెద్దపల్లి ఆగస్టు 20 అక్షరం న్యూస్

మరణానంతరం మరో జీవితానికి వెలుగు నింపేందుకు తన పుట్టినరోజు సందర్భంగా అవయవ శరీర దానానికి అంగీకార పత్రం ఇచ్చిన గడ్డం సునీతఓదెల గ్రామానికి చెందిన గడ్డం సునీతపుట్టిన రోజున స్ఫూర్తిదాయక నిర్ణయంఅభినందించిన గ్రామ సర్పంచ్ కనకిరెడ్డి సతీష్ అవయవ దాన అంగీకార పత్రం సదా ఆశయ ఫౌండేషన్ సభ్యులకు అందించారుమనిషి జీవితం ముగిసిన తర్వాత కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని నిరూపిస్తూ గడ్డం సునీత తల్లిదండ్రుల అనుమతితో ఆదర్శ నిర్ణయం తీసుకున్నారు. మరణానంతరం నేత్రాలు, అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని, పుట్టినరోజు సందర్భంగా గడ్డం సునీత నివాసంలోసదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవదాన అంగీకార పత్రాలపై సంతకాలు చేసి ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూగడ్డం సునీత కుటుంబం తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయమన్నారు. “మన జీవితం ముగిసినా.. మన అవయవాలతో మరో జీవితం కొనసాగాలి” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు టి శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ప్రచార కార్యదర్శి వాసు మరియు ఓదెల టీం కొండ్ర వేణు.మెర్గు సారంగం క్యాతం.మల్లేశం ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు జీడి నవీన్ కేతన్ వెంకటేశ్వర్లు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

- **ఢిల్లీలో ముఖ్యమంత్రికి ఘన వీడ్కోలు**



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడం, పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 1 గంటలకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆయన విదేశీ పర్యటనకు బయలుదేరారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎంపీ మల్లు రవి, రోహిన్ రెడ్డి తదితరులు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విదేశీ పర్యటనలో ముఖ్యమంత్రి వివిధ దేశాల్లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకురావడం ద్వారా పారిశ్రామిక రంగానికి ఊతమివ్వడంతో పాటు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పర్యటన కొనసాగనుంది. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ఈ విదేశీ పర్యటన కీలకంగా నిలవాలని, భారీ పెట్టుబడులు రాష్ట్రానికి తరలిరావాలని హర్కర వేణుగోపాల్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యవసాయ పంటల డిజిటల్ సర్వే పై అవగాహన కార్యక్రమం వీక్షణ





ఓదెల పెద్దపల్లి ఆగస్టు 20అక్షరం న్యూస్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ పంట సర్వే పై అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ, క్షేత్ర స్థాయి సర్వేయర్స్ దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గుండ్లపల్లి రైతు వేదిక లో వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ, రైతు సోదరులు ఈ వానాకాలం సీజన్ లో సాగు చేస్తున్న పంటలను డిజిటల్ క్రాప్ సర్వే చేయించుకోవాలి అని తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి క్షేత్ర స్థాయి సర్వేయర్ ఉంటారు అని . సర్వేయర్ మీ గ్రామానికి వచ్చినపుడు ప్రతి రెవెన్యూ సబ్ డివిజన్ సర్వే నెంబర్ లో ఉన్న పంట వివరాలు నమోదు చేసుకోవాలి. క్షేత్ర స్థాయి లో సర్వేయర్, సర్వే నంబర్ సబ్ డివిజన్ పరిధి లో 20 మీటర్ లో దగ్గరకి వెళ్ళినపుడు మాత్రమే ఆ పంట వివరాలు ఆన్లైన్ లో డిజిటల్ గా నమోదు చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ సంవత్సరం ప్రతి సబ్ డివిజన్ సర్వే నంబర్ లో ఉన్న ప్రతి పంట సర్వే చేయడం జరుగుతుంది. కాబట్టి రైతు సోదరులు వారికి సంబంధించిన ప్రతి సబ్ డివిజన్ సర్వే నంబర్ లో పంట వివరాలు సర్వేయర్ దగ్గర నమోదు చేసుకోవాలి అని సూచించారు. డిజిటల్ పంట సర్వే లో నమోదు కాని రైతుల కు పంట కొనుగోళ్ల సమయం లో ఇబ్బందులు ఉంటాయి అని తెలిపారు.

## గోదావరిఖనిలో ‘తిరగబడ్డ మమకారం’ లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం





జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

నిరీక్షణ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ‘తిరగబడ్డ మమకారం’ లఘుచిత్రం షూటింగ్ గురువారం గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లోని నిరీక్షణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇప్టా జాతీయ సమితి, ప్రజా నాట్యమండలి కళాకారుడు కవ్వంపల్లి స్వామి, సీనియర్ పాత్రికేయులు దయనంద్ గాంధీ, ఎన్పీడీసీఎల్ రిటైర్డ్ ఏడీఈ కె.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. గతంలో పోతుల చంద్రపాల్ రూపొందించిన లఘుచిత్రాలు సమాజాన్ని ఆలోచింపజేసే సామాజిక అంశాలతో రూపొందించబడ్డాయని తెలిపారు. అదే తరహాలో ‘తిరగబడ్డ మమకారం’ కూడా సమాజానికి చక్కటి సందేశాన్ని అందించేలా తెరకెక్కుతోందన్నారు. కన్నవాళ్లను నిరాశ్రయులను చేసినప్పుడు.. తల్లిదండ్రులు తమ మమకారాన్ని చంపుకుని తిరగబడితే ఏర్పడే పరిస్థితులను ఈ చిత్రంలో చూపించనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని తెలియజేసేలా ఈ చిత్రం ఉంటుందని తెలిపారు. ఇటీవల లఘుచిత్రాల పేరుతో కొందరు ఇబ్బందికర టైటిల్స్ తో, అభ్యంతరకర దృశ్యాలతో చిత్రాలను రూపొందిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దర్శకులు, నిర్మాతలు వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ సమాజానికి ఉపయోగపడే, సందేశాత్మక చిత్రాలను రూపొందించాలని సూచించారు. ‘తిరగబడ్డ మమకారం’కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. కాగా గతంలో పలు సామాజిక అంశాలపై లఘుచిత్రాలను రూపొందించిన పోతుల చంద్రపాల్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వ బాధ్యతలు చేపట్టగా, సీనియర్ పాత్రికేయులు మేజిక్ రాజా, పోతు శంకరయ్య, సిరిపురం శ్రీనివాస్, సతీష్, శ్రీలత, రజిత, వేదశ్రీ, అస్మిత్ పాల్గుణ, రియా వృంద తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తిప్పబత్తిని అంజయ్య మేకప్‌మెన్‌గా, కో–డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీరుక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- **సింగరేణి స్థలాల్లో నివసిస్తున్న ప్రజలకు పట్టాల మంజూరుపై సమీక్ష**

జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజల భూ సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా సింగరేణి స్థలాల్లో నివసిస్తున్న ప్రజలకు వైఎస్సార్ పట్టాల మంజూరు, భూ సమస్యల పరిష్కారం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా భూ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జల్ద



అరుణశ్రీ, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సింగరేణి జీఎం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 500 సైకిళ్ల పంపిణీ





జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఎన్టీపీసీ రామగుండం సామాజిక బాధ్యత కార్యక్రమం సౌజన్యంతో గురువారం గోదావరిఖని అశోక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో విద్యార్థులకు 500 సైకిళ్లను పంపిణీ చేశారు. రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైకిళ్లను సద్వినియోగం చేసుకొని పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, బొంతల రాజేష్ ఎన్టిపిసి ఏ జీఎం సాగర్ రంజాన్ సాహూ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారి



కరీంనగర్/శంకరపట్నం ఆగస్టు 20 ( అక్షరం న్యూస్ –:
శంకరపట్నం మండలం తహసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మొలంగూర్ జిపిఓ శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన వ్యక్తి నుండి భూమి మార్పిడి విషయంలో రూ. 20వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు అనిషా అధికారులను సంప్రదించారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్పి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా సదరు వ్యక్తి నుండి జిపిఓ శ్రీనివాస్ రూ. 20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.

## తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా రత్నం అశోక్ నియామకం.



కరీంనగర్/ జమ్మికుంట/ ఆగస్టు 20/ అక్షరం న్యూస్:
తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా జమ్మికుంట మండలానికి చెందిన రత్నం అశోక్ ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సింగారం ప్రేమ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సామాజిక,కుల సంఘాల లో,ఉద్యమాలలో ముందుండి, ప్రజా సమస్యలపై పోరాడరని,సమాజం లో చైతన్యం తీసుకురావడశీ లో విశేష,సేవలు అందించారని కొనియాడారు.నియామక అనంతరం అశోక్ మాట్లాడుతూ, తన పై నమ్మకం ఉంచి ఈ భాధ్యత ను అప్పగించిన తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి రాష్ట్ర వ్యవస్థాపకఅధ్యక్షుడు సింగారం ప్రేమ్ కుమార్ కు, రాష్ట్ర ఉపాధక్షడు పలాటి రాజు కుమార్ కు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు కు,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బోరగాల సమ్మయ్య ,జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు చారి , ఉమ్మడి జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ, వారి కష్ట సుఖలలో బాగస్వామ్యం అవుతానని,పేదల హక్కుల పరిరక్షనకోసం నిరంతరం కృషి చేస్తానని, అవినీతి పై రాజీలేని పోరాటం కొనసాగిస్తానని అశోక్ స్పష్టం చేశారు.ఈ భాధ్యత ను ప్రజల విశ్వాసానికి అంగుణంగా సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

## బి. సి. ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు



కరీంనగర్/హుజురాబాద్/ఆగస్టు 20/అక్షరం న్యూస్:
హుజురాబాద్ పట్టణ కేంద్రంలో బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అయినటువంటి చిలుకమారి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గ అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పంజాల తిరుపతి గౌడ్ మాట్లాడుతూ చిలకమారి శ్రీనివాస్ వైద్య వృత్తిలో కొనసాగుతూ కాట్రపల్లి గ్రామ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్గా కొనసాగుతూ పద్మశాలి కుల పరంగా సేవా కార్యక్రమాలు చేస్తూ మరియు సామాజికపరంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ బీసీ ఉద్యమాల పట్ల చైతన్య పరుస్తూ స్నేహితులతో కలిసి సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొంటూ అంచలంచలుగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిలివేరు శ్రీకాంత్,రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంగెం సత్యనారాయణ, పాత్రికేయులు శివమణి,ఎ.ఎ. నాయకులు కోడూరి శ్రీనివాస్, పబ్బ తిరుపతి, ఐతీ సంగెం ఐలయ్య, కందుకూరి భాస్కర్, మంచి కట్ల కమలాకర్, రాజు, బొంగోని చంద్రమౌళి, ఆకుల సదానందం, మునీందర్, శ్రీనివాస్, ఉమా శంకర్, సాయి, శ్రావణ్, బొంగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కస్టమర్ అవగాహన కార్యక్రమం




కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 20/అక్షరం న్యూస్: జమ్మికుంట పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో కస్టమర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.బ్రాంచ్ మేనేజర్ హరినాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతా నంబర్, ఏటీఎం పిన్, ఓటీపీ, పాస్ వర్డ్, సీవీవీ వంటి రహస్య వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదని సూచించారు. అపరిచిత ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, గుర్తుతెలియని యాప్ ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.టీఎం కార్డు వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్డు పోయినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు గుర్తిస్తే వెంటనే బ్యాంకును సంప్రదించాలని సూచించారుఅలాగే బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణాలు, గోల్డ్ లోన్లపై ఖాతాదారులకు వివరించారు. రుణం తీసుకునే ముందు వడ్డీ రేటు, కాలపరిమితి, వాయిదాలు, ఇతర నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు.2018లో ప్రారంభమైన జమ్మికుంట ఇండియన్ బ్యాంక్ శాఖ ప్రస్తుతం రూ.200 కోట్లకు పైగా లావాదేవీలను నిర్వహిస్తూ ఖాతాదారులకు సేవలు అందిస్తోందని బ్యాంకు సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, సిబ్బంది గణేష్, శ్రీకాంత్, హర్షతో పాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం





కరీంనగర్/శంకరపట్నం/ఆగస్టు 20( అక్షరం న్యూస్
మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తున్నదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలం తాడికల్, మొలంగూర్, కొత్తగట్టు, కేశవపట్నం ఆయా గ్రామాలలో రూ.20 లక్షలతో నూతన వి.వో.బిల్డింగ్ లకు అధికారులతో నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కన్నాపూర్, కేశవపట్నం గ్రామాలలో పల్లె దావకానాలను ప్రారంభించారు. గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రజా ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ప్రైవేట్ హాస్పిటల్ ప్రజలకు పోకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు ఉన్నాయన్నారు. మిడిమిడి జ్ఞానంతో వైద్యం చేసే ఆర్ఎంపీ డాక్టర్లను మీ ప్రాణం మీదికి తీసుకోవద్దని సూచించారు. కేశవపట్నంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఎల్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజ్గోపాల్, తహసీల్దార్ సురేఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పనస అనిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ జిల్లా నాయకుడు గట్టు తిరుపతి గౌడ్, తాడికల్, గద్దపాక,మెట్పల్లి ప్యాక్స్ చైర్మన్లు కీసర సంపత్, గోపగోని బస్వయ్య గౌడ్, గాజుల మహేష్,మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్,ఆయా గ్రామాల సర్పంచులు దుర్గం సుజాత– తిరుపతి గౌడ్,నూనె రమ– శ్రీనివాస్,పూదరి రాజు, మాద సుజాత– రాజిరెడ్డి, గోదారి రాజేంద్రప్రసాద్, చింతిరెడ్డి పద్మ,ఎగ్గని శ్రీలత– రమేష్, మండల ఉప సర్పంచుల చైర్మన్ గొట్టె మధు,పార్టీ నాయకులు నాంపల్లి తిరుపతి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు కీసర వెంకటేష్,తాటికొండ సదానందం, నేరెళ్ల సంతోష్, టి.తిరుపతి, మొలంగూరి సదానందం, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్ల పంపిణీ





భద్రాద్రికొత్తగూడెం/అశ్వారావుపేట/ఆగస్టు 20/అక్షరం న్యూస్:అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్ల పంపిణీ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఏ. అనిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు.

### పేద విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు

ప్రిన్సిపాల్ ఏ. అనిత మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు మాత్రమే అందించేవారని, ఈ విద్యా సంవత్సరం నుంచి నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్లతో పాటు యూనిఫాంలను కూడా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో పేద విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శ్రీ జూపల్లి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్లు, యూనిఫాంలతో పాటు ఇతర సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### కళాశాల అభివృద్ధికి సహకారం

ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి గౌరవ ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణతో కలిసి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని జూపల్లి రమేష్ తెలిపారు.

### నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్ల పంపిణీ

అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ అరవింద్ బాబు, కళాశాల సీనియర్ అధ్యాపకులు, లైబ్రేరియన్ శ్రీమతి ఎస్.కె. సాహిదా, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు




**•-మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం..**
**•ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డుకు రూ.17.72 కోట్లు నిధులు మంజూరు.**
**•రోడ్లపై పండ్ల విక్రయాదారుల ఇబ్బందులకు ఊరట..**
**•ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన యూనియన్ నాయకులు.**

ఖమ్మం జిల్లా / ఖమ్మం టౌన్ / ఆగస్టు 21 / అక్షరం న్యూస్ –:
ఖానాపురం ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పండ్ల వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఖానాపురం హవేలీలోని మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హనుమంత రావు, కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అశ్రీఫ్ మాట్లాడుతూ.. మంత్రి ప్రత్యేక చొరవతో నిలిచిపోయిన మార్కెట్ యార్డు పనులు తిరిగి ఊపందుకున్నాయని తెలిపారు. అనంతరం ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.
అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానిమియా, కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు గరగ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత నిధులతో మార్కెట్ యార్డులో మొత్తం 31 అభివృద్ధి పనులు చేపట్టనున్నారని, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ట్రేడర్స్ షాపులు, కవర్ షెడ్లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ బ్రిడ్జి, రైతుల విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు తదితర మౌలిక వసతులు కల్పించనున్నారని వివరించారు.
మార్కెట్ యార్డు ప్రాంగణంలో సీసీ ఫ్లోరింగ్, అంతర్గత రహదారుల అభివృద్ధి, కాంపౌండ్ వాల్, టవర్ లైట్లు, విద్యుదీకరణ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్కెట్ పూర్తయితే రోడ్లపై పండ్ల విక్రయాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వ్యాపారులు, రైతులు, వినియోగదారులకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మార్కెట్ అభివృద్ధితో పండ్ల వ్యాపార కార్యకలాపాలు మరింత క్రమబద్ధంగా సాగుతాయని అన్నారు.వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయన తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్, కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అశ్రీఫ్ చేసిన కృషికి అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, సహాయ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు, కోశాధికారి ఉస్మాన్, గౌరవ సలహాదారులు అన్నపు మల్లికార్జున్, ఖాసీం, కరీం తదితరులు పాల్గొన్నారు.



# అశ్వారావుపేటలో చెలరేగుతున్న ఇసుక మాఫియా





- అధికారుల కళ్లముందే అక్రమ రవాణా..
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి!

భద్రాద్రికొత్తగూడెం/అశ్వారావుపేట/ఆగస్టు 20/అక్షరం న్యూస్ :-అశ్వారావుపేట మండలంలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక వాగుల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు, ట్రక్కుల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మామూళ్ల ఆరోపణలపై విచారణ చేయాలి

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ అక్రమ రవాణా కొనసాగుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన సీనరేజ్ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని పేర్కొంటున్నారు. అధికారులు మామూళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

### నిబంధనలు గాలికి.. ప్రజల ప్రాణాలకు ముప్పు

ఇసుక రవాణా చేస్తున్న కొన్ని వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోవడం, డ్రైవర్లకు సరైన డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుకను టార్పాలిన్‌తో కప్పకుండా, అతివేగంగా వాహనాలను నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో రహదారులపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు ఇసుక కళ్లలో పడటం, ప్రమాదాల ముప్పు పెరగడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని అంటున్నారు.

### రూ.3,500 నుంచి రూ.4,000 వరకు ట్రాక్టర్ ఇసుక?

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఇసుకను సామాన్యులకు ట్రాక్టర్‌కు రూ.3,500 నుంచి రూ.4,000 వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు ధరలు, అనుమతులు, సీనరేజ్ చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డుకుంటే బెదిరింపులా?

ఇసుక రవాణాను ప్రశ్నించే వారిని కొందరు నిర్వాహకులు బెదిరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో పోలీస్ కేసులు నమోదు కాకుండా డబ్బులతో రాజీ చేస్తున్నారన్న ఆరోపణలపైనా విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

అక్రమ ఇసుక రవాణాపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నంబర్ ప్లేట్లు లేని, అనుమతులు లేని వాహనాలను గుర్తించి సీజ్ చేయడంతో పాటు, ఇసుక తవ్వకాలు మరియు రవాణాకు సంబంధించిన అనుమతులను పరిశీలించాలని కోరుతున్నారు. అలాగే స్థానిక అధికారులపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా వెనుక ఎవరున్నారు? అధికారుల పాత్ర ఏంటి? అనే అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

# ఇల్లందకుంటలో ఘనంగా భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు





కరీంనగర్/ఇల్లందకుంట/ ఆగస్టు 20/అక్షరం న్యూస్:
డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు ఇల్లందకుంట మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... రాజీవ్ గాంధీ కేవలం ప్రధానమంత్రి మాత్రమే కాదని, భారతదేశాన్ని భవిష్యత్తు వైపు నడిపించాలని కలలు కన్న దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. యువతపై అపార నమ్మకంతో దేశ అభివృద్ధిలో యువతకు కీలక పాత్ర ఉండాలని విశ్వసించారని అన్నారు. భారతదేశంలో కంప్యూటర్, టెలికమ్యూనికేషన్, ఆధునిక సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన హయాంలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, నేటి డిజిటల్ ఇండియాకు ఆయన వేసిన పునాదులే కారణమని తెలిపారు. ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించడం ద్వారా కోట్లాది మంది యువతకు ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. దేశ సమైక్యత, సాంకేతిక అభివృద్ధి, విద్య, యువత సాధికారత కోసం ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు.

### ఓటర్ నమోదు:

ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాంలో భాగంగా రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను ఫారం-6 ద్వారా ఓటర్లుగా నమోదు చేసి, దరఖాస్తులను ఇల్లందకుంట తహసిల్దార్ పి. మనోజ్ కుమార్ కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎక్కటి సంజీవరెడ్డి గూడెపు సారంగపాణి, కనుమల్ల రామకృష్ణ, ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, పెద్ది శివకుమార్, , కళ్లెం సత్యనారాయణరెడ్డి, ఏలేటి రఘుపతి రెడ్డి, కనుమల్ల సంపత్, ఎక్కేటి మధుసూదన్ రెడ్డి, గొడుగు మానస, వంగ రామకృష్ణ, బొమ్మ శ్రీనివాస్, జిల్లెల్ల సందీప్ రెడ్డి, బండి మల్లయ్య, గోరుకుంట్ల స్వామి, మూడుఎట్ల రమేష్, మేడద తిరుపతిరెడ్డి, బోగం సాయిరాం, మూడెత్తుల మల్లేష్, మర్రి వీరారెడ్డి, గుండారపు సాయికుమార్, గూడెపు ఓదెలు, ఆరే రమేష్ రెడ్డి, గంసాని తిరుపతి, రేణిగుంట రవీందర్, మంకు ఐలయ్య, భోగం పృథ్వీరాజ్, రావుల ఎల్లయ్య, రావుల రాజబాబు, మారేపల్లి వంశీ, ఎండి లాల్ మహ్మద్, కొప్పుల మల్లారెడ్డి, దాసరి తిరుపతి, మురహరి రాజు, జిల్లెల్ల దేవేందర్ రెడ్డి, జిల్లెల్ల రాంప్రసాద్, జిల్లెల్ల జలంధర్ రెడ్డి, దార నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి

- - మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని
- ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు





కరీంనగర్/హుజురాబాద్/ఆగస్టు 20/అక్షరం న్యూస్:
మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని, ప్రతి ఒక్కరూ ఆయనను స్మరించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విశ్వసించిన రాజీవ్‌గాంధీ యువతకు ఎన్నో అవకాశాలు కల్పించారని అన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, ప్రజాస్వామ్య నిర్మాణంలో యువతకు కీలక పాత్ర కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అన్నారు. యువతకు అవకాశాలు కల్పించడం, గ్రామీణాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ఆయన విశేష కృషి చేశాడన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన పాత్ర చిరస్మరణీయమైందని అన్నారు. అలాగే ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని, యువత రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవస్థానం చైర్మన్ కొలిపాక శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి కిరణ్, పట్టణాధ్యక్షుడు మేకల తిరుపతి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పుల్ల రాధ, కౌన్సిలర్లు సమ్మయ్య, సొల్లు సునీత, మొగిలి, సందమల్ల పుణ్య, వెంకట్, జన్నోజు భాస్కర్, సీనియర్ నాయకులు సొల్లు బాబు, రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, కుమారస్వామి, సంపత్, ఉప్పు శ్రీనివాస్, సందమల్ల బాబు తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరస్పాండెంట్ రూపారెడ్డి ని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- చొప్పదండి ట్రస్మా డిమాండ్



చొప్పదండి/ కరీంనగర్,ఆగస్టు 20( అక్షరం న్యూస్ )
నల్గొండ జిల్లాలో జరిగిన పాఠశాల కరస్పాండెంట్ రూపా రెడ్డి దారుణ హత్యకు నిరసనగా చొప్పదండి ట్రస్మ ఆధ్వర్యంలో చొప్పదండి మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు ఉపాధ్యాయ ఉపాధ్యాయునిలు అందరూ కలిసి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి తెలంగాణ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రస్మా అధ్యక్షులు గుర్రం ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ ఇట్టి ఘటనకు కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇట్లాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయునిలకు తగిన రక్షణ కల్పించాలని పిల్లల అలవాట్లను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని పిల్లలు ఫోను చూస్తూ చెడు అలవాట్లకు లోనవుతున్నారని ఫోన్ చూస్తున్నప్పుడు పిల్లలను గమనించాలని కోరారు.
ఇట్టి కార్యక్రమంలో ట్రస్మ అధ్యక్షులు గుర్రం ఆనంద్ రెడ్డి, శ్రీమతి కనకరాజు లక్ష్మారెడ్డి నరేందర్ రాకేష్ రెడ్డి రవికుమార్ లింగారావు దేవానంద్, చొప్పదండి మండల అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులు ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు

# విద్యార్థి నాయకులపై పోలీసుల దౌర్జన్యం - ఏఐవైఎఫ్ తీవ్ర నిరసన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /ఆగస్టు 20/ అక్షరం న్యూస్-:
మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా ఉద్యమిస్తున్న విద్యార్థి నాయకులపై సీఐ రఘుపతి రెడ్డి కర్కశంగా వ్యవహరించడాన్ని, వారి గొంతు నొక్కే ప్రయత్నం చేయడాన్ని ఆలిండియా యూత్ ఫెడరేషన్ ములకలపల్లి మండల సమితి ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తాండ్ర సమ్మయ్య, భూక్య వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ పోలీసులు వ్యవహరిస్తున్న తీరును తప్పుబాడుతూ, బాధ్యులైన పోలీసులపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టడి చేయాలని కోరారు. తెలంగాణ సాధన కోసం 1200 మంది విద్యార్థులు అమరులై ప్రాణత్యాగాలు చేస్తేనే ఈ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు. అటువంటి తెలంగాణలో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే విద్యార్థులపై పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం సరైనది కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఏడు రకాల సన్నలకే బోనస్ - ఏవో అరుణ్ బాబు

- సెప్టెంబర్ 10 లోపు నమోదుకు గడువు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /ఆగస్టు 20/ అక్షరం న్యూస్-:తెలంగాణ ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్న వరి రకాలను (ఆర్ఎన్ఆర్-15048, బీపీటీ-5204, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్) సాగు చేస్తున్న రైతులు సెప్టెంబర్ 10 లోపు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అరుణ్ బాబు అధికారి అన్నారు.?డీలర్ల వద్ద కొన్నవారు ఆధార్, పాస్‌బుక్, కొనుగోలు రసీదుతో డీలర్ వద్దే పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలి.?సొంత విత్తనాలు ఉన్నవారు ధృవీకరణ పత్రంతో పాటు వివరాలను తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలని
?నిర్ణీత గడువులోగా నమోదు చేసుకున్న రైతులకే క్వింటాల్‌కు రూ.500 బోనస్ వర్తిస్తుందని అధికారులు తెలిపారు. ములకలపల్లి మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# చొప్పదండిలో ఘనంగా రాజీవ్ గాంధీ 82 వ జయంతి



చొప్పదండి /కరీంనగర్,ఆగస్టు 20( అక్షరం న్యూస్ )

నవ భారత నిర్మాత, మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా చొప్పదండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ నవ భారత నిర్మాణానికి పునాది వేసిన నాయకులు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల ఆధునీకరణకు పునాది వేసి సమాచార సాంకేతిక పితామహుడిగా పేరు గావించిన వ్యక్తని, దేశంలో ఓటు వేసే కనీస వయస్సు 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత ఆయనేదనన్నారు. జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టి జవహర్ నవోదయ విద్యాలయాలను స్థాపించి దేశంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కృషి చేసిన గొప్ప నాయకుడు రాజీవ్ అని దేశం ఇప్పుడు ఇంతలా పురోగతి చెందడానికి ఆయన అప్పుడు తీసుకు వచ్చిన సంస్కరణల వల్లనే అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంల వివిధ గ్రామాల ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు సింగిల్ విండో పాలక వర్గం, మార్కెట్ కమిటీ పాలక వర్గం, గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / ఆగస్టు 20 / అక్షరం న్యూస్-:

భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు పెద్దపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యంగా యువతకు రాజకీయ, సామాజిక రంగాల్లో సముచిత ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేసిన అంశాలను గుర్తు చేశారు. అంతేకాకుండా దేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన దూరదృష్టితో చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నుగిల్లా మల్లయ్య, కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## రాజ్యసభ సభ్యుడు మందాటి అనిల్ కుమార్ యాదవ్ ను కలిసిన జిల్లా శ్రీకృష్ణ కమిటీ సభ్యులు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఆగస్టు 20: మండలంలోని గోవర్ధనగిరిలో గల ప్రాచీన శ్రీకృష్ణ ఆలయంలో సెప్టెంబరు 4న జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరు కావాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు మందాటి అనిల్ కుమార్ యదవ్ను జిల్లా శ్రీకృష కమిటీ సభ్యులు గురువారం హైదరాబాద్ కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కాన గంటి ముత్తయ్య యాదవ్, ఉపాద్యక్షుడు దండబోయిన హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి తాటికొండ వెంకటేష్ యాదవ్, వారాల రమేష్, సతీష్, మహేందర్, తోటకూరి వెంకటేష్, పాండరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు బీఎస్పీ పూర్తి మద్దతు

- -బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్...
- ఐదో రోజుకు చేరిన నిరసన దీక్ష..
- నల్ల బెలూన్లు ఎగరేసి జర్నలిస్టుల వినూత్న నిరసన.



కరీంనగర్/హుజూరాబాద్/ఆగస్టు 20/అక్షరం న్యూస్:

హుజూరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం సాగుతున్న న్యాయపోరాటం, సామాజిక ఉద్యమానికి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన శాంతియుత నిరసన దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్,బి ఎస్పీ నాయకులు,ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య సందర్శించి జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

### కలిసికట్టుగా పోరాడితేనే హక్కుల సాధన...

ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. హక్కుల సాధనకు ఐక్య పోరాటమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. 'చలి చీమలు ఏకమై పెద్ద పామును సైతం అంతమొందించినట్లుగా' జర్నలిస్టులంతా ఏకతాటిపై నిలిచి పోరాడాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల నిరంతర ప్రజాసేవను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ఈ ప్లాట్లను మంజూరు చేసిందని, ఇవి ఏ ఒక్క రాజకీయ పార్టీయో ఇచ్చినవి కావని గుర్తుచేశారు.

రాజకీయ వైషమ్యాలు ఏవైనా ఉంటే ఎన్నికల బరిలో తేల్చుకోవాలే తప్ప, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కలాలకు ఈ దుస్థితి రావడం విచారకరం...

నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తి, పాలకుల దృష్టికి తీసుకెళ్లే కలాలే నేడు తమ కనీస హక్కుల కోసం రోడ్డెక్కి దీక్షలు చేయాల్సి రావడం బాధాకరమన్నారు.జర్నలిస్టుల న్యాయమైన సమస్యలపై స్పందించని నాయకులు, రాజకీయ పార్టీల వార్తలను పూర్తిగా బహిష్కరించాలని సూచించారు. జర్నలిస్టుల సహాయ నిరాకరణను ఎదుర్కొని ఏ నాయకుడూ రాజకీయంగా మనుగడ సాగించలేరని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రణవ్ కేవలం ముఖ్యమంత్రికి, అధిష్టానానికి శుభాకాంక్షలు తెలపడానికే పరిమితం కాకుండా, ఈ వివాదాన్ని సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

### జర్నలిస్టుల ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర...

**- కొలిపాక సమ్మయ్య**

ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి జర్నలిస్టుల న్యాయమైన ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కృత్రిమ ఉద్యమాలను సృష్టిస్తూ పన్నాగం పన్నుతున్నారని మండిపడ్డారు. ఇప్పల నర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాల ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలు గ్రామానికి చెందినవంటూ వారిలో విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల ప్రజలు ఆయన మాయమాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

### హోరెత్తిన నినాదాలు.. నల్ల బెలూన్లతో నిరసన...

ఐదో రోజు నిరసనలో భాగంగా జర్నలిస్టులు ఆకాశంలోకి నల్ల బెలూన్లను ఎగురవేసి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. డప్పు చప్పుళ్లతో కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి వైఖరికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

తక్షణమే జర్నలిస్టుల స్థలాలపై వేసిన కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని, "మా స్థలాలు మాకు ఇవ్వాలి.. మా హక్కులు కాపాడాలి" అంటూ నినదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కళాకారుల ఆటపాటలు, గేయాలు దీక్షా శిబిరంలో పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు, బీఎస్పీ నాయకులు గిన్నారపు మహేందర్, వేల్పుల మల్లేష్, అంబాల ప్రభాకర్,ఇల్లందుల రమేష్, మంద సమ్మయ్య,దొడ్డ సమ్మయ్య,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం , చందుపట్ల జనార్ధన్,ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# జాతీయ ఫోటోగ్రఫీ పోటీలో పొనగంటి రాజు ప్రతిభ తొలి స్థానంతో పాటు ద్వితీయ బహుమతి కైవసం



జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో జమ్మికుంటకు చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ పొనగంటి రాజు మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు

కరీంనగర్/జమ్మికుంట/ ఆగస్టు 20 /అక్షర న్యూస్;

నాగ్‌పూర్‌లోని ఆరెంజ్ సిటీ ఫోటోగ్రాఫర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30వ వార్షిక ఫోటోగ్రఫీ



పోటీ2026లో కరీంనగర్‌కు చెందిన ఫోటోగ్రాఫర్ పొనగంటిరాజుప్రతిభచాటారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన 700కు పైగా ఎంట్రీల్లో పొనగంటి రాజు సమర్పించిన రెండు ఫోటోలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఒక ఫోటోకు ద్వితీయ బహుమతిగా ?11,000 నగదు బహుమతి లభించగా, మరో ఫోటో గ్రాండ్ ఎగ్జిబిషన్‌కు ఎంపికై ప్రదర్శించబడింది. నాగ్‌పూర్‌లోని సౌత్ సెంట్రల్ జోన్ కల్చర్ సెంటర్లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ఎంపికైన ఫోటోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆరెంజ్ సిటీ ఫోటోగ్రాఫర్స్ క్లబ్ నిర్వాహకులకు, తన ఫోటోను ప్రత్యేకంగా ప్రచురించిన సిటీ భాస్కర్ నాగపూర్ పత్రికకు పొనగంటి రాజు కృతజ్ఞతలు తెలిపారుఅలాగే మీకు పంపిన ఫోటో కాంటెస్ట్ నుండి కూడా ఫస్ట్ ప్లేస్ సర్టిఫికెట్ అఫ్ మెరిట్ కూడా వచ్చింది రెండు కలిపి మన జమ్మికుంట ప్రెస్ వాళ్లకు ఎలా పంపించాలిజాతీయ ఫోటోగ్రఫీ పోటీలో పొనగంటి రాజు ప్రతిభతొలి స్థానంతో పాటు ద్వితీయ బహుమతి కైవసంకరీంనగర్ ఖ్యాతిని చాటిన ప్రముఖ ఫోటోగ్రాఫర్.నాగ్‌పూర్ పోటీల్లో ప్రత్యేక గుర్తింపు తాజాగా మరో కాంటెస్ట్‌లో ఫస్ట్ ప్లేస్ సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్.జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో జమ్మికుంటకు చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ పొనగంటి రాజు మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. నాగ్‌పూర్‌లోని ఆరెంజ్ సిటీ ఫోటోగ్రాఫర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30వ వార్షిక ఫోటోగ్రఫీ పోటీ--2026లో ఆయన ప్రతిభ కనబరిచారు దేశ, విదేశాల నుంచి వచ్చిన 700కు పైగా ఎంట్రీల్లో ఆయన సమర్పించిన రెండు ఫోటోలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఒక ఫోటోకు ద్వితీయ బహుమతిగా రూ.11,000 నగదు బహుమతి లభించగా, మరో ఫోటో గ్రాండ్ ఎగ్జిబిషన్‌కు ఎంపికై నాగ్‌పూర్‌లోని సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్లో ప్రదర్శించబడిందిఈ విజయాల ఉత్సాహం ముగియకముందే, తాజాగా మరో ఫోటో కాంటెస్ట్‌లోనూ పొనగంటి రాజు అరుదైన ఘనత సాధించారు ఆ పోటీలో ఆయనకు మొదటి స్థానం (ఫస్ట్ ప్లేస్)తో పాటు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్' కూడా లభించింది వైవిధ్యమైన కోణాల్లో ప్రకృతి సంస్కృతిని తన కెమెరాలో బంధిస్తూ వస్తున్న రాజు వరుస జాతీయ పురస్కారాలు సాధించడం పట్ల జమ్మికుంట ప్రెస్ క్లబ్ సభ్యులుస్థానిక ఫోటోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.



## ఉద్యమకారుల సమితి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా జాగటి శాంతమ్మ



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగించాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన తెలంగాణ ఉద్యమకారుల సమితి నాయకురాలు జాగటి శాంతమ్మను పెద్దపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించారు. ఈ మేరకు గురువారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తోడేటి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను ప్రభుత్వం గుర్తించి వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కుల సాధన కోసం సమితి ఆధ్వర్యంలో మరింత బలమైన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళా ఉద్యమకారులను సంఘటితం చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జాగటి శాంతమ్మకు సూచించారు. తనపై నమ్మకంతో పెద్దపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి శంకర్ గౌడ్‌కు జాగటి శాంతమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ జిల్లాలోని మహిళా ఉద్యమకారులను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల సాధన కోసం సమితి చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటానని పేర్కొన్నారు.

## మండేలగూడెం సబ్ స్టేషన్ పవర్ ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ పెంపుదల



జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఆగస్టు 20: మండలంలోని ఖిలాషాపూర్ సెక్షన్ లో ని మండేలగూడెం సబ్ స్టేషన్ లో 3.15 ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీని 5.0 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ స్థాయికి పెంచారు. ఈ మేరకుజనగామ డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్ లక్ష్మినారాయణ రెడ్డి డిఈ ఎంఆర్టీ విజయ్ పవర్ ట్రాన్స్ఫార్మర్ పెంపుదలకు చార్జ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవర్ ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ పెంపుదలతో మండేలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో గల వినియోగదారులకు లో వోల్టేజీ సమస్య తీరడంతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఈ సుధాకర్, ఏఈ రవీందర్, సబ్ ఇంజనీర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఓపెన్ బాక్స్ ఏర్పాటు.

- తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి.




మంచిర్యాల జిల్లా/ మందమర్రి, ఆగస్టు 20/అక్షరం న్యూస్–:

చెన్నూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల విషయంలో ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలిపేందుకు ఓపెన్ బాక్స్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. పార్టీ, కులం, మతం, వర్గం అనే తేడా లేకుండాప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకోవాలన్నదే నా ఆలోచన అని తెలిపారు. మీ సమస్య ఏదైనా కావచ్చు...మీకు ఏదైనా ఫిర్యాదు ఉండొచ్చు...నాపైనే ఏదైనా ఫిర్యాదు చేయాలనిపించొచ్చు... అలాంటి ప్రతి విషయాన్ని నేరుగా నా దృష్టికి తీసుకురావడానికి ఈ 'ఓపెన్ బాక్స్' ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీరు ఒక పెన్ను, పేపర్ తీసుకుని...మీ సమస్యను, మీ ఫిర్యాదును స్పష్టంగా రాసి ఈ ఓపెన్ బాక్స్‌లో వేయండన్నారు. ఈ ఓపెన్ బాక్స్ తాళం నా దగ్గరే ఉంటుందని బాక్స్‌ను నేనే స్వయంగా తెరిచి... మీరు రాసిన ప్రతి లేఖను నేనే చదివి పరిశీలిస్తానన్నారు. మీ సమస్య, ఫిర్యాదు నిజమైనదైతే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు.

# ఎన్ టి పిసి సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షీ టీమ్ అవగాహన





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: రామగుండం సీపీ ఆదేశాల మేరకు షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి షీ టీమ్ సభ్యులు ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు మహిళల భద్రత, బాలల రక్షణ, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలి, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) నిబంధనలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, విద్యార్థుల ప్రవర్తన, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి వివరించారు. మహిళల భద్రత కోసం ప్రతిరోజూ బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మహిళలకు ఏదైనా ప్రమాదం ఎదురైనా, బెదిరింపులకు గురైనా వెంటనే 100 లేదా 112కు ఫోన్ చేయాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు ప్రయాణ సమయంలో భద్రత కోసం టీ–సేఫ్ యాప్‌ను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం ..యువకుడు మృతి








### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

జ్యోతినగర్ ఎన్టిపిసి ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ రాజీవ్ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ నుంచి రామగుండం వైపు ముగ్గురు యువకులు ఒకే మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ప్రశాంత్‌నగర్ వద్ద బైక్ అదుపుతప్పి రహదారి మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బికాస్ చంద్ర జాల్ (28) తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న కరం దుర్గ, రంజన్ దుర్గలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు యువకులు చతిస్గడ్ రాష్ట్రానికి చెందిన వారని, రామగుండం ప్రాంతంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని పోలీసులు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనపై ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



జనగామ జిల్లా/రఘునాధపల్లి/( అక్షరంన్యూస్)ఆగస్టు 20: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రావర్తి రాజు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ కు అందజేశారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది హమాలీ కార్మికులు మార్కెట్లు, గోదాములు, రైస్ మిల్లులు తదితర రంగాలలో పని చేస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారని. హమాలీలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య సదుపాయాలు, ప్రమాద బీమా వంటి కనీస సంక్షేమ సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి

జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బైరగోని బాలరాజు, కొంగరి నర్సయ్య, పెండేల శ్రీనివాస్, ఎండి.దస్తగిరి, మద్దూరి యాదగిరి, శాడ వెంకటయ్య, దండు రాజు, కౌడగాని కుమార్, దొరగొల్ల గట్టయ్య, బుచ్చయ్య, హరిబాబు, సురేష్, కంచెకు మార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలతో యువత గ్రామీణాభివృద్ధికి కృషి





• ములకనూరులో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు..

• కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు..

హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / ఆగస్టు 20 / అక్షరం న్యూస్:-

స్వర్గీయ మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములకనూరులో గురువారం కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విశ్వసించిన రాజీవ్ గాంధీ యువతకు ఎన్నో అవకాశాలు కల్పించారని అన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య నిర్మాణంలో యువతకు కీలక పాత్ర కల్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు.

భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే దూరదృష్టితో సమాచార సాంకేతిక టెలికమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారని తెలిపారు. నేడు దేశం సాధిస్తున్న సాంకేతిక ప్రగతికి ఆయన వేసిన పునాదులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ భారత అభివృద్ధికి రాజీవ్ గాంధీ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీలకు అధికారాలు, నిధులు పెంచడంతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. యువతకు అవకాశాలు గ్రామీణాభివృద్ధి సాంకేతిక పురోగతి బలమైన ప్రజాస్వామ్యం ఆయన దూరదృష్టికి నిదర్శనాలని పేర్కొన్నారు.

రాజీవ్ గాంధీ ఆలోచనలు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ యువత భవిష్యత్తు గ్రామీణాభివృద్ధి కోసం ప్రజల పక్షాన నిరంతరం పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

### వీరభద్రస్వామిని దర్శించుకున్న మంత్రి..

అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాలి ప్రమోన్రెడ్డి, ఉపసర్పంచ్ కాసగోని మమత, మార్కెట్ కమిటీ చైర్మన్ బొక్కల ప్రవంతిరెడ్డి, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్, సీనియర్ నాయకులు ఊసకోయిల ప్రకాశ్, కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, చంద్రశేఖర్ గుప్తా, బొజ్జపూరి అశోక్ ముఖర్జీ, మంగ రామచంద్రం, చిట్కూరి అనిల్, పోగుల శ్రీకాంత్, గజ్జల రమేష్, సీఐ పులి రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





# విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఆగస్టు 20: విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా కొండవ ల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డిని అదే స్కూల్లో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార ులు హత్య చేసిన ఘటనపై వెల్ది మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు గురువారం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రూపారెడ్డి మృతికి తీవ్ర సంతాపం తెలియజేస్తూ. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రవ మంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ జయశ్రీ, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్. ఉపాధ్యాయులు మల్లం శ్రీధర్, పార్వతి, షహానా సుల్తానా, తుమ్మ రవి, మోహన్రావు, దారం శ్రీను, మాలతి, వినీల, వసంత మాధురి, బాలరాజు, లలిత, రేణుక, మారపాక రాజయ్య, ఇల్లందుల రాజు, గుగులోతు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీఓ ను సన్మానం చేసిన తడి హిప్పర్గా సర్పంచ్



మద్నూర్ / ఆగస్టు 20 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం తడి హిప్పర్గా గ్రామ పంచాయతీ సర్పంచ్ అశ్విని సుదర్శన్, కార్యదర్శి జ్యోతి ఎంపీడీఓ పి. సాయిలు ను శాలువా తో సన్మానం చేశారు. గురువారం రోజున ఎంపీడీఓ సాయిలు హిప్పర్గా గ్రామ పంచాయతి సందర్శించడం జరిగింది. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా అందె సంక్షేమ పథకాలు లబ్ధిచేకూర్చాలని కోరారు.

# రైల్వే అభివృద్ధికి ఎంపీ వంశీకృష్ణ దూకుడు జీఎంతో కీలక భేటీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్


: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో రైల్వే సౌకర్యాల విస్తరణ, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తితో పాటు ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీలతో కలిసి రైల్వే జనరల్ మేనేజర్‌తో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పలు రైల్వే సమస్యలను ఎంపీ వంశీకృష్ణ జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గానికి మరిన్ని రైళ్లను కేటాయించాలని, ముఖ్యమైన రైళ్లకు అదనపు నిలుపుదల సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడంతో పాటు రైల్వే మౌలిక వసతులను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే అనుసంధానాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఎంపీ పేర్కొన్నారు. ప్రజల రాకపోకలు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా రైల్వే సేవలను మెరుగుపరచడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

పెద్దపల్లి పార్లమెంట్ ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర రైల్వే శాఖ స్థాయిలో నిరంతరం కృషి చేస్తానని వంశీకృష్ణ తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో రైల్వే మౌలిక వసతులకు ప్రాధాన్యత కల్పించాలని అధికారులను కోరారు. ఎంపీ ప్రస్తావించిన అంశాలపై రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. సంబంధిత సమస్యలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలువురు ఎంపీలు, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రోన్ నిఘాతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఈవ్‌టీజింగ్, బహిరంగ మద్యపానానికి చెక్





లిబహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 13 మందిపై కేసులు నమోదు, పోకిరీలకు కౌన్సెలింగ్

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు ప్రజలకు ప్రశాంతమైన,సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా మంచిర్యాల పట్టణం, నస్పూర్,శ్రీరాంపూర్ ప్రాంతాల్లో మంచిర్యాల

డీసీపీ ఎ.భాస్కర్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రోన్ నిఘా ఆపరేషన్ నిర్వహించారు.

పాఠశాలలు,బాలికల వసతి గృహాలు, కళాశాలల పరిసరాలు,గోదావరి నది తీర ప్రాంతాలు, మైదానాలు తదితర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం, యువతను ఇబ్బందులకు గురిచేయడం,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

రాజీవ్‌నగర్‌లోని గర్ల్స్ మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ పరిసర ప్రాంతాలు,ఎఫ్‌సీఐ గోదాం ప్రాంతం, కాలేజీ రోడ్డు,గోదావరి నది తీర ప్రాంతాలు, అలాగే మంచిర్యాల, నస్పూర్,శ్రీరాంపూర్ పరిధిలోని మైదానాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా నిర్వహించారు. డ్రోన్ విజువల్స్ ఆధారంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 13 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఈవ్‌టీజింగ్, అనుమానాస్పదంగా సంచరించడం,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ఎ.భాస్కర్ మాట్లాడుతూ, పాఠశాలలు, కళాశాలలు,బాలికల వసతి గృహాలు,మహిళలు మరియు విద్యార్థినులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం, మహిళలు మరియు బాలికలను వేధించడం,వారిని వెంబడించడం వంటి చర్యలను పోలీసులు ఏమాత్రం సహించబోరని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, అసభ్యంగా ప్రవర్తించడం, గొడవలకు పాల్పడటం, మహిళలు మరియు విద్యార్థినులను వేధించడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు పోలీసుల నిఘా నుంచి తప్పించుకోలేరని డీసీపీ తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ రోజు నుంచి మంచిర్యాల పట్టణంతో పాటు నస్పూర్,శ్రీరాంపూర్ పరిధిలోని సున్నిత ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు,బాలికల వసతి గృహాల పరిసరాలు,నదీతీర ప్రాంతాలు, మైదానాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రోన్ నిఘా నిరంతరం కొనసాగుతుందని వెల్లడించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రత, మహిళలు మరియు విద్యార్థినుల రక్షణ విషయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తారని డీసీపీ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు,ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## యువరాజ్ సింగ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ !



టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ విజేత యువరాజ్ సింగ్ కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే మెంటార్‌గా ఆటగాళ్లకు దిశానిర్దేశం చేస్తున్న యువరాజ్ సింగ్.. ప్రొఫెషనల్ క్రికెట్‌లో అధికారికంగా ఇప్పటి వరకు కోచ్‌గా వ్యవహరించలేదు. అప్‌కమింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో యువరాజ్ సింగ్ కోచ్‌గా అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్ బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఇప్పటికే యువరాజ్ సింగ్ నియామక ప్రక్రియ పూర్తయిందని, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే బాధ్యతలు స్వీకరిస్తాడని ప్రచారం జరుగుతోంది.ఐపీఎల్ 2027 మినీ వేలంలో యువరాజ్ సింగ్ పాల్గొంటాడని తెలుస్తోంది. హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్‌కు కళ్లు చెదిరే పారితోషకం ఇచ్చేందుకు ఢిల్లీ యాజమాన్యం సిద్ధమైందని సమాచారం. రూ.9.5 కోట్ల భారీ వేతనంతో యువరాజ్ సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే ఓ కోచ్ అందుకున్న అత్యధిక పారితోషకం ఇదే కావడం విశేషం. ఇప్పటి వరకు రికీ పాంటింగ్ పేరిట ఈ రికార్డ్ ఉంది. పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ రూ.9 కోట్ల వేతనం అందుకుంటున్నట్లు సమాచారం. అతని తర్వాత స్టీఫెన్ ఫ్లేమింగ్ రూ.7.5 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ డైరెక్టర్‌గా జహీర్ ఖాన్ రూ. 5 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ రూ.4.5 కోట్లు, ఆండీ ఫ్లవర్, జస్టిన్ లాంగర్ రూ.4 కోట్ల చొప్పున వేతనం తీసుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ చరిత్రలోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. యువరాజ్ సింగ్ పర్యవేక్షణలోనైనా ఆ ముచ్చట తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ జట్టు ఉంది. రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న రిషభ్ పంత్.. తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఆరంభంలో మెరుగైన ప్రదర్శన చేసినా.. కీలక సమయంలో చేతులెత్తేసింది. 14 మ్యాచ్‌ల్లో 7 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానంలో నిలిచింది.

## బీసీసీఐపై మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం



భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)పై మాజీ క్రికెటర్, 1983 ప్రపంచకప్ విన్నర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌పై ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు వస్తున్నాయని, అతనిపై చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించాడు.జూనియర్ లెవెల్ క్రికెట్ సెలెక్షన్‌లో ఎంపికయ్యేందుకు మిథున్ మన్హాస్ ఏజ్ ఫ్రాడ్‌కు పాల్పడినట్లు జమ్మూ కశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ మాజీ జాయింట్ సెక్రటరీ సుదర్శన్ మెహతా ఆరోపించారు. మాజీ డీఎస్పీ అయిన సుదర్శన్ మెహతా.. మిథున్ మన్హాస్‌పై చర్యలు తీసుకోవాలని కోర్టును కూడా ఆశ్రయించారు. సబ్-జూనియర్, జూనియర్ విభాగాల్లోని నేషనల్ టోర్నీల ఎంపికకు అర్హత సాధించేందుకు మన్హాస్ రెండు వేర్వేరు పట్టిన తేదీలను సమర్పించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబర్ 3లోపు నివేదిక సమర్పించాలని జమ్మూలోని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ న్యూస్ క్లిప్‌ను ఎక్స్ వేదికగా షేర్ చేసిన కీర్తి ఆజాద్.. బీసీసీఐ ఏం చేస్తుందని విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏం చేస్తోంది? ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. మిథున్ మన్హాస్‌కు రెండు వేర్వేరు జన్మదిన తేదీలు ఉన్నాయి . ఒకటి బీసీసీఐలో నమోదైతే.. మరొకటి డీడీసీఏలో నమోదైంది. బీసీసీఐ తన సొంత అధ్యక్షుడిపై చర్యలు తీసుకుంటుందా?'అని అని కీర్తి ఆజాద్ ప్రశ్నించారు. కీర్తి ఆజాద్ పోస్ట్‌తో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. మాజీ దేశవాళీ క్రికెటర్ అయిన మిథున్ మన్హాస్ జమ్మూకశ్మీర్‌కు చెందినవాడు. జమ్మూకశ్వీర్ తరపున కెరీర్ ప్రారంభించిన అతను ఆ తర్వాత న్యూఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణించినా.. టీమిండియా తరపున ఆడే అవకాశం అతనికి రాలేదు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించాడు. ఏజ్ క్రికెట్ కోసం తన బర్త్ డే డేట్‌ను 9/12/1977 పేర్కొన్న మిథున్ మన్హాస్.. ఢిల్లీకి ఆదే సమయంలో 12/10/1979గా పేర్కొన్నాడని ఆరోపణలు వస్తున్నాయి. క్రికెట్‌లో ఏజ్ ఫ్రాడ్‌ను తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఈ ఆరోపణలపై మిథున్ మన్హాస్ కానీ, బీసీసీఐ కానీ ఇప్పటి వరకు స్పందించలేదు.

## జపాన్ పర్యటనకు పాఠశాల విద్యాశాఖ అధికారులే!



అక్షరం ప్రతినిధి హైదరాబాద్ ఆగస్టు 20 జపాన్ పర్యటనకు వెళ్లే 11 మంది అధికారుల్లో దాదాపు అందరూ పాఠశాల విద్యాశాఖ అధికారులే ఉన్నారు. ఫిన్లాండ్ పర్యటనకు టీచర్ల పేరిట ఇంటర్, డిగ్రీ అధికారులు, లెక్చరర్లను పంపించడంపై విమర్శలు రావడంతో ఈ సారి విద్యాశాఖ ఉన్నతాధికారులు జాగ్రత్తపడినట్లు భావిస్తున్నారు. అధికారుల బృందంలోని 11 మందిలో 8 మంది పేర్లు సోమవారం బయటకొచ్చాయి. మిగిలిన ముగ్గురులో ఒకరు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, మరొకరు పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఖమ్మం జిల్లాకు చెందిన ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ ఉన్నట్లు సమాచారం. కాకపోతే పాఠశాల విద్యాశాఖలో 8 మంది అదనపు సంచాలకులు, 8 మంది జాయింట్ డైరెక్టర్లు ఉన్నారు. వారిలో ఫిన్లాండ్‌కు ఒక అదనపు సంచాలకుడిని మాత్రమే పంపగా... ఈ సారి ఒక ఏడీ, ఒక జేడీని ఎంపిక చేశారు. మరోవైపు జపాన్‌కు వెళ్లనున్న 29 మంది టీచర్లలో కొందరి ఎంపికపై ఆరోపణలు వస్తున్నాయి.

# సచిన్‌తో పోల్చితే కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడు






### సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధానం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మోహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లీ రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లీ విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లీ ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై 51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 123 టెస్ట్‌ల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లీ సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లీ అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు. విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ అడుగుజాడల్లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ కొనసాగుతున్నారని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్‌కు మంచి టెక్నిక్ ఉంది. అతను భారత జట్టుకు ఒక పెద్ద ఆస్తి. కానీ విదేశాల్లో అతని సగటు కేవలం 34 మాత్రమే. ఈ విషయంలో అతను ఇంకా మెరుగవ్వాలి. క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోర్లు చేయాలి. కేవలం సెంచరీలే కాకుండా డబుల్ సెంచరీలు చేయాలి. ఎందుకంటే కొత్త బంతికి ఔటవ్వడం ఎప్పుడైనా జరగవచ్చు. కాబట్టి మెరుగైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మల్చాలి'అని డివిలియర్స్ సూచించాడు.

# శ్రీలంకతో రెండో టెస్ట్ కు కుల్దీప్‌పై వేటు!!

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నదమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్ తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది. తొలి టెస్ట్‌లో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్.. రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. మరోవైపు మానవ్ సుతర్ 10 వికెట్లతో సత్తా చాటగా.. జడేజా నాలుగు వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి.అయితే కుల్దీప్ యాదవ్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అనగా.. అతి తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసి ఎక్కువ పరుగులిచ్చాడని ఆకాశ్ చోప్రా తెలిపాడు. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు.మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించాలని అశ్విన్ సూచించాడు. ఆకాశ్ చోప్రా మాత్రం కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనా వేసాడు. మరి టీమ్‌మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో




చూడాలి. తొలి టెస్ట్‌లో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా.. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా.. సర్ఫరాజ్ ఖాన్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్ట్‌కు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్ట్‌లో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి టెస్ట్‌లో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా.. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకీబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 20 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గోదావరిఖని ఆర్ వన్ జీఎం కార్యాలయం వద్ద గురువారం ఆయన విగ్రహానికి రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేశారని అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ఆయన చేసిన కృషి, అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ స్మృతికి



ఘన నివాళులర్పిస్తున్నట్లు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్ కులను కవిత రెడ్డి చీదరాళ్ళ నాగరాజు పెద్దల్లి ప్రకాష్ తిప్పారపు సుదర్శన్ పి చర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609